క్లుప్తంగా

అమ్మవారికి బంగారం సమర్పణ



బంగారం అందజేస్తున్న దాత

భీమవరం(ప్రకాశంచౌక్): శ్రీమావుళ్లమ్మ స్వర్ణ వస్త్రానికి భీమవరానికి చెందిన కలిదిండి వెంకట సీతారామరాజు, నిత్యశ్రీ కార్తీ దంపతులు 16 గ్రాముల బంగారం సమర్పించారు. వీరికి ఆలయ ఉప ప్రధాన అర్చకుడు కొప్పేశ్వరరావు ప్రత్యేక పూజ, ఆశీర్వచనాలు నిర్వహించి ప్రసాదాలు, శేష వస్త్రం ఫొటో అందించారని, ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీనగేష్ తెలిపారు.

కాళ్లకూరు వెంకన్నకు పవళింపు సేవ



కాళ్లకూరు వెంకన్నకు పవళింపు సేవ చేస్తున్న అర్చకులు

కాళ్ల: కాళ్లకూరులో కొలువైన స్వయంభు శ్రీవేంకటేశ్వర స్వామి తిరుకల్యాణ మహోత్సవాల ముగింపు సందర్భంగా ఆఖరి రోజైన బుధవారం రాత్రి స్వామి, అమ్మవార్లకు పుష్పయాగోత్సవం (పవళింపు సేవ) నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ద్వాదశ భోగాలు (12) ప్రసాదాలు సమర్పించారు. ఏర్పాట్లను దేవస్థానం ఈఓ ఎం.అరుణ్ కుమార్, సిబ్బంది పర్యవేక్షించారు.

అమ్మవారికి పులిహోర నైవేద్యం



అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

భీమవరం(ప్రకాశంచౌక్): మెంటే వారి తోటలోని శ్రీబాలా త్రిపుర సుందరి అమ్మవారికి 100 కిలోల పులిహోర నైవేద్యం సమర్పించారు. అమ్మవారి ఆలయ వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు.

పేదలకు భోజన ప్యాకెట్ల పంపిణీ



ఇందిరమ్మ కాలనీలో పేదలకు భోజన ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం: సమాజంలో ఉన్న అభాగ్యులకు చేతనైన సహాయం అందించడం భగవంతుడు మెచ్చే కార్యక్రమమని పలువురు వక్తలు పేర్కొన్నారు. భీమవరం పట్టణానికి చెందిన కోడే రాజు ఆధ్వర్యంలో సుమారు 200 మందికి భోజనం ప్యాకెట్లను గురువారం పంపిణీ చేశారు. తాడేరు రోడ్‌లోని ఇందిరమ్మ కాలనీలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కోడే రాజు, కోడె శివ మిత్ర బృందం, అల్లు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో షాపులకు దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం(ప్రకాశంచౌక్): ఆర్టీసీ బస్టాండ్ పరిధిలోని 15 షాపులకు, ఉండి, కాళ్లలోని రెండు షాపులకు టెండర్ దరఖాస్తులు చేసుకోవచ్చని ఆర్టీసీ డిపో మేనేజర్ పి.సత్యనారాయణమూర్తి తెలిపారు. ఈ నెల 22వ తేదీ లోగా ఏలూరులోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో దరఖాస్తులు తీసుకోవాలని, 23న మధ్యాహ్నం రెండు గంటల లోపు టెండర్ ఫారాలను బాక్స్‌లో వేయాలని, మధ్యాహ్నం 3 గంటలకు టెండర్‌దారుల సమక్షంలో బాక్సులను తెరుస్తారని తెలిపారు. అసిస్టెంట్ మేనేజర్ వై.సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక

ఆకివీడు: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా ఏఎంసీ మాజీ చైర్మన్ ఎస్‌కే రసూల్ బీబీ కలిశారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎస్‌కే హుస్సేన్ ఉన్నారు.

ఎయిడ్స్‌పై కళాజాత

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎయిడ్స్ పై అవగాహన ఉంటే ప్రాణాలు దక్కించుకోవచ్చునని ఎయిడ్స్ నియంత్రణ మండలి కళాజాత సభుడు ఎం.రవిబాబు అన్నారు. పెంటపాడులో గురువారం ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని అంటించుకునే వ్యాధి అని డప్పు కళాకారులతో ఎయిడ్స్ వ్యాధి, సోకే విధానం, నివారణ, చికిత్స, ఐసీటీసీ కేంద్రం అవశ్యకత, ఏఆర్‌టీ సెంటర్ ప్రాధాన్యత, హెచ్ఐవీ టోల్‌ఫ్రీ నెంబర్ 1097 తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

కాలుష్యపు కోరల్లో కాలువలు

- రోగాల బారిన ప్రజలు
- పట్టించుకోని సంబంధిత శాఖల అధికారులు



సీసలి, కోపల్లె, పెదఅమిరం వద్ద ఫ్యాక్టరీ వ్యర్థాలతో నిండిన కాలువ



ఫ్యాక్టరీ వ్యర్థ నీటితో కలుషితమైన బొండాడ మురుగు కాలువ

కాళ్ల: వ్యర్థాలతో కాలువలు కాలుష్యం బారిన పడుతున్నాయి. మండలంలోని సీసలి గ్రామంలో పెదఅమిరం గ్రామం వరకు రాష్ట్రీయ రహదారిని ఆనుకుని ఉన్న రొయ్యల పరిశ్రమల వలన కాలువలు కాలుష్యమవడంతో ముక్కుపుటాలు అదిరేలా దుర్గంధం వెదజల్లుతోంది. సాధారణంగా రొయ్యల పరిశ్రమలో వ్యర్థ నీటిని రీసైక్లింగ్ చేసి బయటకు విడుదల చేయాలి. కానీ నిబంధనలను పాటించకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందని పలువురు పెద్దలు ఆరోపిస్తున్నారు. వ్యర్థ నీరు వదలటం వలన పరిశ్రమలను ఆనుకుని ఉన్న కాలువల్లో నీరు, మట్టి మేటలు వేసి భయంకరమైన దుర్వాసన వస్తుందని వాపోతున్నారు. సీసలి నుంచి పెదఅమిరం వరకు రాష్ట్రీయ రహదారి వెంబడి ప్రయాణించే వాహనదారులు, ప్రయాణికులు ముక్కు మూసుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి వచ్చిందని ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంత దుర్గంధం వెదజల్లుతున్నా సంబంధిత శాఖ అధికారులు గానీ గ్రామ స్థాయి అధికారులు గాని పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు సీసలి గ్రామం పరిధిలో ప్రసిద్ధమైన సాయిబాబా దేవాలయం, అదే విధంగా పెద్దఅమిరం పరిధిలో పాఠశాలలు ఉన్నాయి. బాబా ఆలయానికి వచ్చే భక్తులు తీవ్ర దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు చెబుతున్నారు.

దుర్గంధంతో వ్యాధుల భయం

అంతే కాకుండా పాఠశాలలో విద్యార్థులు గ్రామాల్లో ప్రజలు దుర్వాసన రావడంతో వ్యాధులు ప్రభలుతాయని భయపడుతున్నారు. పరిశ్రమలను ఆనుకొని ఉన్న కాలువలతో పాటు ప్రధాన మురుగు కాలువలు సైతం కాలుష్యం బారిన పడుతున్నాయి. ప్రధానంగా బొండాడ మురుగు కాలువలో నీరు కాషాయరంగులో మారిపోయి దుర్వాసన వస్తున్నాయి.ఎగువ భాగంలో పరిశ్రమల నుండి వ్యర్థ నీరు వదలటం వల్లే ఈ పరిస్థితి వస్తుందని పలువురు చెబుతున్నారు. అదే విధంగా ప్రధాన మురుగు కాలువ మొగదిండి సైతం ఇదే పరిస్థితి ఉంది. ఈ నీటిని గతంలో వాడుకోవడంతో పాటు తాగటానికి కూడా ఉపయోగించే వారమని కాలువను అనుకొని ఉన్న గ్రామస్తులు చెబుతున్నారు. అయితే నేడు వాడకానికి కూడా నీటిని వాడలేకపోతున్నామని అంత దుర్గంధం వస్తోందని, దీని వలన ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక పక్క నియోజకవర్గంలో పంట మురికి కాలువల అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెబుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఈ కాలువలు దుర్గంధంలో కూరుకుపోతున్నాయని పలువురు పెద్దలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పరిశ్రమల నుంచి విడుదల చేసే నీటిని రీ సైక్లింగ్ చేసి బయటకు వదిలేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కాలుష్యం బారిన పడకుండా కాలువలను కాపాడాలని, దుర్గంధం వెదజల్లకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉండి: ఉండి, కోలమూరు విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు పత్రికా ప్రకటనలో గురువారం తెలిపారు. ఉండి సబ్‌స్టేషన్ పరిధిలో ఉండి, పెదపుల్లేరు, చినపుల్లేరు, కలిసిపూడి, చెరుకువాడ, మహదేవపట్నం, చిలుకూరు, వెలివర్రు గ్రామాల్లో గృహ అవసరాలతో పాటు పరిశ్రమలు, ఆక్వా చెరువులకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. కోలమూరు సబ్‌స్టేషన్ పరిధిలో కొత్తలైన్ల ఏర్పాటు కారణంగా ఉదయం ఎనిమిదినుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సబ్ సెంటర్ పరిధిలోని గ్రామాలకు, ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ తెలిపారు.

ఇళ్ల స్థలాల అర్హతల నిబంధనలను సడలించాలి

భీమవరం: ఇళ్ల స్థలాల అర్హతల నిబంధనలు సడలించి, పేదలకు ఇళ్ల స్థలాలు అందజేయాలని సీపీఎం జిల్లా కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ మాట్లాడుతూ అందరికీ ఇళ్ల పథకంలో భాగంగా ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసిందని ఆయన తెలిపారు. లబ్ధిదారుడి తండ్రికి 2 లేదా 3 సెంట్ల ఇంటి స్థలం ఉంటే ఒక కొడుకుని అనర్హుడిగా ప్రకటించడం సరికాదన్నారు. ఈ నిబంధనలను సడలించాలని ఆయన కోరారు.

పోలీసు ఉద్యోగులకు సత్కారం



బదిలీ అయిన పోలీసు ఉద్యోగులను సత్కరిస్తున్న అధికారులు

భీమవరం: టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించి, పలు ప్రాంతాలకు బదిలీ అయిన పోలీస్ ఉద్యోగులకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. స్థానిక హన్సీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి టూ టౌన్ సీఐ జి.కాళీచరణ్ అధ్యక్షత వహించి, మాట్లాడుతూ తనతో పాటు పని చేసిన ఎనిమిది మంది సిబ్బంది బదిలీ కావడంతో వారికి చిరు సత్కారం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో రూరల్ సీఐ శ్రీనివాస్, ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు, సబ్ జైల్ సూపరింటెండెంట్ వెంకట్, టూ టౌన్ ఎస్సైలు రెహమాన్, ఇజ్రాయిల్, ట్రాఫిక్ ఎస్సై రామకృష్ణ, పోలీస్ ఉద్యోగుల సంఘం నాయకుడు మోజస్, అల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న లయన్స్ ప్రతినిధి నెల్లి మహేశ్వరి

ఆకివీడు: వేసవి సెలవుల్లో విద్యార్థులు ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉండేందుకు వారికి ప్రత్యేక శిక్షణా శిబిరాలు వేదికలవుతున్నాయని లయన్స్ ప్రతినిధి నెల్లి సతీష్‌కుమార్, మహేశ్వరి చెప్పారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా కార్యక్రమంలో భాగంగా గురువారం విద్యార్థులకు క్విజ్ పోటీలు, కథలు, పాటలు, విజ్ఞానదాయక కార్యక్రమాలను తెలిపారు. అడ్వకేట్, లయన్స్ ప్రతినిధి సతీష్ కుమార్ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు సెల్‌ఫోన్లకు అతుక్కుని ఉండకుండా విజ్ఞానం అందజేసే పుస్తకాలను చదవాలన్నారు. అనంతరం నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కార్యదర్శి నారాయణరాజు(బాబు), రీడర్స్ ఫోరం అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ, దిలీప్, అహ్మద్, గ్రంథాలయ కార్యదర్శి పార్వతి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ పునర్నిర్మాణం



స్వామి వారిని దర్శించుకుంటున్న గ్రామ పెద్దలు

కాళ్ల: మండలంలోని జక్కరంలో ప్రసిద్ధ దేవాలయం శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ పునః ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ మాజీ చైర్మన్, పాతపాటి శ్రీనివాసరాజు, కోపల్లె సొసైటీ మాజీ అధ్యక్షుడు నంద్యాల రామరాజు మాట్లాడుతూ గ్రామంలోని పెద్దలు ప్రభుత్వ నిధులతో ఆలయ పునర్నిర్మాణం చేసుకోగలిగామన్నారు. ఆలయ చైర్మన్ నంబూరి సతీష్ రాజు మాట్లాడుతూ శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయం పునర్నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో సీజీఎఫ్ నిధుల ఏర్పాటుకు దివంగత మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● ఆకాశం మేఘావృతం..



దొంగపిండిలో గురువారం సాయంత్రం చల్లబడిన వాతావరణ దృశ్యం

బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా గురువారం సాయంత్రం ఆకాశం మేఘావృతమై చల్లని గాలులు వీయడంతో గ్రామస్తులు సేద తీరారు. కొన్ని ప్రాంతాల్లో వర్షం పడింది. గత రెండు వారాలుగా ఎండలు, ఉక్కబోతతో తీవ్ర ఇబ్బందులు పడిన ప్రజలు వాతావరణం ఆహ్లాదకరంగా మారడంతో ఊరట చెందారు.

– భీమవరం అర్బన్

తణుకు ఆసుపత్రికి బాలబాలికలు



తణుకు జిల్లా ఆసుపత్రికి బాలబాలికలను పంపిస్తున్న డాక్టర్ ప్రతాప్ కుమార్

యలమంచిలి: రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమంలో భాగంగా ఏఎస్ఎంలు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు తమ పరిధిలో అనారోగ్య సమస్యలు ఉన్న బాల బాలికలను గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకురావాలని లంకలకోడేరు పీహెచ్‌సీ వైద్యాధికారి అడ్డాల ప్రతాప్ కుమార్ అన్నారు. వారికి వైద్య పరీక్షలు నిర్వహించి కళ్లు, పల్లు, చర్మం, చెవి, ముక్కు, గొంతు ఇతర అనారోగ్య సమస్యలు ఉంటే ప్రత్యేక వైద్య పరీక్షల నిమిత్తం తణుకు జిల్లా ఆసుపత్రికి పంపుతామని చెప్పారు. గురువారం లంకలకోడేరు పీహెచ్‌సీ నుంచి తణుకు ఆసుపత్రికి పలువురు బాల బాలికలను పంపినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పీహెచ్ఎన్ పి.ఎలిజబెత్, ఫార్మసిస్ట్ పాటబళ్ల వెంకటస్వామి, స్టాఫ్ నర్స్ ముత్యవల్లి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

పెనుమంట్ర: ఆలమూరు గ్రామం వద్ద బుధవారం రాత్రి మట్టిలోడుతో వెళుతున్న ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన పెరుమాళ్ల అబ్బులు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గురువారం తణుకు ప్రైవేటు ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై కె స్వామి తెలిపారు. అబ్బులు పాలకొల్లు నుంచి తాడేపల్లిగూడెం మోటారు సైకిల్‌పై వెళుతుండగా ఈ ప్రమాదం జరిగిందన్నారు.

దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి



కార్మికులను సమ్మెకు సమాయత్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఉండి: కార్మికుల హక్కులను కాపాడేందుకు ఈ నెల 20వ తేదీన ప్రజా సంఘాల పిలుపు మేరకు నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ధనికొండ శ్రీనివాస్ అన్నారు. గురువారం ఉండిలోని ఓ రైస్ మిల్లులో కార్మికులకు సమ్మెపై అవగాహన కల్పించారు. కార్మికులు తమ హక్కులను కాపాడుకునేందుకు పోరాటాలు చేయాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో రైస్‌మిల్లు కార్మికులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్



కాటన్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న నేతలు

భీమవరం(ప్రకాశంచౌక్): అపర భగీరథుడు, ప్రజల ఆరాధ్యుడు సర్ ఆర్థర్ కాటన్ అని ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్యనారాయణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉగ్ర నరసింహ, ఏఈ వెంకటేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రెస్ట్ హౌస్ రోడ్డులోని కాటన్ విగ్రహం వద్ద సర్ ఆర్థర్ కాటన్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళిలర్పించారు. కార్యక్రమంలో కొండ్రు శ్రీనివాస్, విజ్జురోతి రాఘవులు, ఆర్.అప్పాజీ, ఎం.గణపతి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు కొనసాగుతోంది

ఆకివీడు: పంట, మురుగు కాలువలు, మంచినీటి చెరువు గట్లు, రోడ్డు పోరంబోకు ఆక్రమణల తొలగింపు కొనసాగుతోందని డిప్యూటీ స్పీకర్ కె.రఘురామ కృష్ణరాజు చెప్పారు. మండలంలోని అయిభీమవరం గ్రామంలో వేద పాఠశాలను, స్థానిక సీహెచ్‌సీ, పార్కు ప్రాంతాన్ని గురువారం కలెక్టర్ చదలవాడ నాగరాణితో కలిసి సందర్శించారు. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు ఆర్డీఓ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు, కమిషనర్ కృష్ణమోహన్, మోటుపల్లి ప్రసాద్, మాజీ ఎంపీ కనుమూరు బాపిరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులను ప్రోత్సహించాలి



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

భీమవరం: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ది భీమవరం ఎల్‌హెచ్ టౌన్ హాల్ ఆధ్వర్యంలో ఇటీవల పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన 21 మున్సిపల్, ప్రభుత్వ, జెడ్పీ పాఠశాలలోని 120 మంది విద్యార్థులకు గురువారం ప్రతిభా పురస్కారాలు (మెరిట్ స్కాలర్ షిప్)లను ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా అందించారు. ప్రతిభావంతులను ప్రోత్సహించి, ఈ విధంగా పురస్కారాలను అందించడం అభినందనీయమన్నారు. మొదటి 5 ర్యాంక్ లు సాధించిన 120 మంది విద్యార్థులకు సుమారు రూ.3 లక్షల విలువైన ప్రతిభా పురస్కారాలను ప్రశంసా పత్రాలతో అందించామన్నారు. కార్యక్రమంలో టౌన్ హాల్ గౌరవాధ్యక్షుడు మెంటే పార్థసారధి, అధ్యక్ష, కార్యదర్శులు కోళ్ల రామచంద్రరావు, గ్రంధి సురేష్, బేతు కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆనంద స్త్రీ పురస్కారాలు

భీమవరం: ఈ నెల 16వ తేదీన ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆనంద స్త్రీ పురస్కారాలు–25 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ ఉద్దరాజు కాశీ విశ్వనాథ్ రాజు, కంతేటి వెంకటరాజు, దాయన చంద్రజీ, రఘుపతి రాజు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎస్పీ నయీం సతీమణి హీనా తక్, మాజీ ఎంపీ బాపిరాజు సతీమణి కనుమూరి అన్నపూర్ణ, ప్రముఖ సంగీత విద్వాంసురాలు కొల్లూరి వందన (తిరుపతి), జిల్లా వైద్య అధికారిణి గీతాబాయి, పోలీస్ శాఖ, ఆనంద గ్రూప్‌కు చెందిన ఆరుగురు ఉత్తమ సేవాతాత్పరులకు, 50 మంది మున్సిపల్ మహిళ పారిశుధ్య కార్మికులకు అభినందన సత్కార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

నరసాపురం రూరల్: ముఠా కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు డిమాండ్ చేశారు. నరసాపురం మార్కెట్ యార్డులో ఉన్న సివిల్ సప్లై గోడౌన్ వద్ద సివిల్ సప్లై కార్మికులతో కలిసి ఆయన ఈనెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మె పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్, గ్రాట్యూటీ, పని గంటలు, యూనియన్ పెట్టుకునే హక్కు, సమ్మె మొదలగు చట్టాలన్నిటినీ కేంద్రంలోని బీజేపీ నీరుగార్చుతోందని ఆరోపించారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా తీసుకొచ్చిన లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. లేబర్ కోడ్లు రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని, 8 గంటల పని విధానం అమలు చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నోముల కొండ సివిల్ సప్లయి కార్మిక నాయకులు కుక్కల వెంకటేశ్వరరావు, రవి, మల్లుల రామ చక్రవర్తి, గుత్తుల రఘుబాబు, అరవ సత్యనారాయణ, పాల్గొన్నారు.

రేపు బహిరంగ వేలం

భీమవరం: స్థానిక ప్రాహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మద్యం కేసులో పట్టుబడిన హోండా యాక్టివా ద్విచక్ర వాహనాన్ని వేలం వేయనున్నట్లు సీఐ కె.బల రామరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 17వ తేదీ శనివారం సాయంత్రం 5 గంటలకు ఎక్సైజ్ స్టేషన్ వద్ద వేలం నిర్వహించనున్నామన్నారు.